

ఇంజనీరింగ్ కళాశాలకు రూ.35 కోట్లు

హుస్నాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలు, క్యాంపస్ అభివృద్ధికి రూ.35 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలో మంజూరైన కళాశాలను తాత్కాలికంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఈ కాలేజీ భవన నిర్మాణానికి ఉమ్మాపూర్ సమీపంలోని 36 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే కేటాయించారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



సభ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సీఎం బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 3న హుస్నాబాద్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆయన హుస్నాబాద్ పట్టణంలోని స్థూపం వద్ద మైదానంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సీఎం హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని, అలాగే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, ఇతర సమస్యలు నెరవేర్చే విధంగా ఈ పర్యటన ఉంటుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం నాలుగు జిల్లాలకు కేంద్రంగా ఉందని, ఈ ప్రాంతాన్ని విద్యా, వైద్యం, పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాల కల్పన, ఇరిగేషన్ ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందెలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేబినెట్ మంత్రులందరు వస్తున్నారని, సభకు విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట హౌజ్ ఫెడ్ మాజీచైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ మల్లికార్జున్, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, చిత్తారి రవీందర్, బంక చందు తదితరులున్నారు.

ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ

రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ శనివారం హుస్నాబాద్ పట్టణంలో పర్యటించారు. ప్రజలు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, డైవర్షన్ మార్గాలు, ప్రవేశ- నిష్క్రమణ ప్రదేశాలు, వంటి అంశాలను పరిశీలించారు. పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించి.. ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులున్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ

పోటెత్తిన నామినేషన్లు

- చివరి రోజు భారీగా...
- అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చిన ఆర్వోలు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన స్వీకరణ

తొలివిడత నామినేషన్లకు శనివారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు పోటెత్తారు. సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులతో ఆయా నామినేషన్ కేంద్రాల్లో సందడి నెలకొన్నది. సాయంత్రం 5 గంటలకు గడువు ముగియగా అప్పటికే కేంద్రాల్లో అభ్యర్థులు పెద్దఎత్తున వరుసలో వేచిఉన్నారు. ఐదు గంటల లోగా వరుసలో ఉన్న వారి నుంచి నామినేషన్ల పత్రాలను స్వీకరించారు. పలుచోట్ల అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది.



వర్గల్ మండల కేంద్రంలో నామినేషన్ కేంద్రం వద్ద నిల్చున్న అభ్యర్థులు

గజ్వేల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్, మర్కుక్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో శనివారం ఉదయం నుంచే నామినేషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొన్నది. ఏడు మండలాల్లోని 163 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు 131 నామినేషన్లు, రెండో రోజు 194 నామినేషన్లు, మూడో రోజు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. 1432 వార్డులకు మొదటి రోజు 75, రెండో రోజు 445, మూడవ రోజూ భారీగా నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. దౌల్తాబాద్ మండలంలో 25 జీపీ సర్పంచ్ స్థానాలు, 214 వార్డులకు రాత్రి వరకు నామినేషన్లు దాఖలాయ్యాయి. గజ్వేల్ 25 జీపీ సర్పంచ్ స్థానాలకు 167, జగదేవ్‌పూర్ 25 సర్పంచ్ స్థానాలకు మొత్తం 160, 222 వార్డులకు 400 పైచిలుకు నామినేషన్లు దాఖలయ్యాయి. మర్కుక్ 16 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు 86, ములుగు 26 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు 154, వార్డు సభ్యులకు 571 నామినేషన్లు వచ్చాయి. ఇక రాయపోల్ 19 గ్రామపంచాయతీలకు తొలిరోజు 19, రెండో రోజు 27, మూడో రోజు 59 మొత్తం 99 నామినేషన్లు వచ్చాయి. 166 వార్డు స్థానాలకు మొదటి రోజు 11, రెండో రోజు 51, మూడో రోజు 319 నామినేషన్లు వచ్చాయి. వర్గల్ 27 సర్పంచ్ స్థానాలకు 80, 238 వార్డు స్థానాలకు 450 నామినేషన్లను దాఖలు చేశారు.

అభ్యర్థులకు టోకెన్లు ..

శనివారం ఉదయం నుంచి నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటెత్తడంతో సాయంత్రం ఐదు గంటల అనంతరం నామినేషన్ కేంద్రాల లోపల ఉన్న అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు టోకెన్లను జారీ చేశారు. టోకెన్ల ప్రకారం వారిని పిలిచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి క్లస్టర్‌లో టోకెన్లు ఇవ్వకుండా గేట్ లోపల ఉన్న అభ్యర్థుల వద్ద గల నామినేషన్ పత్రాలను అధికారులు తీసుకున్నారు. దీంతో తమ పేరు ఎప్పుడో వస్తుందో తెలియక అభ్యర్థులు బయటకు వెళ్లలేక, అక్కడే కూర్చోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా క్లస్టర్ల వద్ద నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

పలు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం
7

నేటి నుంచి రెండోవిడత

సిద్దిపేట రెవెన్యూ డివిజన్‌లో
10 మండలాలు
వీటిలో 182 జీపీలు,
1,644 వార్డులకు
నామినేషన్లు
డిసెంబరు 2 వరకు
స్వీకరణ

సిద్దిపేట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. జిల్లాలో 508 గ్రామ పంచాయతీలు, 4,508 వార్డులుండగా, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 27 ప్రారంభమూ 29న ముగిసింది. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మిగతా 8లో...

మండలం	జీపీలు	వార్డులు
అక్బర్‌పేట-భూంపల్లి	19	168
బెజ్జంకి	24	210
చిన్నకోడూర్	28	256
దుబ్బాక	21	188
మిరుదొడ్డి	10	98
నంగునూరు	25	220
నారాయణరావుపేట	11	96
సిద్దిపేట రూరల్	15	140
సిద్దిపేట అర్బన్	12	116
తొగుట	17	152
మొత్తం	182	1,644

ఉద్యమానికి, సిద్దిపేటకు విడదీయరాని బంధం

- కేసీఆర్ దీక్ష ఒక చరిత్ర
- నవంబరు 29 లేకుంటే, డిసెంబరు 9 ప్రకటన, రాష్ట్ర ఏర్పాటే లేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- దీక్షా దివస్ పురస్కరించుకుని భారీ బైక్ ర్యాలీ, పైలాన్ ఆవిష్కరణ



పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద దీక్ష పైలాన్‌కు శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమానికి, సిద్దిపేటకు విడదీయరాని బంధం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పొన్నాల వద్ద బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఉద్యమనాటి ఫొటోల ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్, అందెశ్రీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నవంబరు 29 ఒక చరిత్ర అని, ఇది మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు అని తెలిపారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన, కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష చారిత్రాత్మకమని కొనియాడారు. కేసీఆర్ ఆమరణ దీక్ష స్ఫూర్తితోనే సిద్దిపేటలో 1,531 రోజులపాటు రిలే దీక్షలు చేపట్టామన్నారు. నవంబరు 29 లేకపోతే, డిసెంబరు 9 ప్రకటన ఉండేది కాదు, జూన్ 2 రాష్ట్ర ఏర్పాటే లేదన్నారు. ఉద్యమ సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా, ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచలా వదులుకున్న బీఆర్ఎస్‌ది ఒక చరిత్రేనని వివరించారు. నాయకులు రాజనర్సు, రవీందర్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం, ఎడ్ల అరవింద్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఉద్యమ గడ్డలో నాటి ఉత్సాహం..

దీక్షాదివస్‌లో భాగంగా, హరీశ్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, తెలంగాణ తల్లి, ఆచార్య జయశంకర్, పూలే, బీజేఆర్ విగ్రహానికి, రంగదాంపల్లి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిలే దీక్షల జ్ఞాపకార్థం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం స్మృతి చిహ్నానికి (పైలాన్) పునఃశంకుస్థాపన చేశారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన ముగ్గురు తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబాలను ఘనంగా సన్మానించి, వారి త్యాగాలను కొనియాడారు.

మళ్లీ చలి పంజా

- వారం రోజుల తర్వాత గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- కోహీర్‌లో కనిష్ఠంగా 7.8 డిగ్రీలు

కోహీర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 13వ తేదీ నుంచి 21 వరకు శీతల గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి పంజా విసిరింది. ఈ రోజుల్లో ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆ తర్వాత నుంచి మొన్నటి వరకు చలి తీవ్రత అంతగా కనిపించలేదు. వారం రోజుల తర్వాత ఒక్కసారిగా మళ్లీ చలి తీవ్రత పెరిగింది. శనివారం సంగారెడ్డి జిల్లాల్లో పది చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో 7.8 డిగ్రీలు అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లోని దామరంచలో కనిష్ఠంగా 10.2, సిద్దిపేట జిల్లాలోని పోతిరెడ్డిపేట, అంగడికిష్టాపూర్‌లో 10.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు

సిద్దిపేట జిల్లా : పోతిరెడ్డిపేట్ 10.1, అంగడి కిష్టాపూర్ 10.1, కొండపాక 10.2, హబ్సీపూర్ 10.5, నంగునూరు10.6, బేగంపేట్ 10.8, గౌరారం 11.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



పటాన్‌చెరులో రహదారిపై కమ్ముకున్న పొగమంచు

ఇప్పుడు తెచ్చి ఏం లాభం..!

'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' అన్న చందంగా ఉంది చేర్యాల పట్టణంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పరిస్థితి. జోరుగా కొనుగోళ్లు ఉన్నప్పుడు తూర్పార యంత్రాలు అందుబాటులో ఉంచాల్సి ఉండగా.. ఇప్పుడు తుది దశలో తేవడంపై రైతులు మండి పడుతున్నారు. ఇన్నాళ్లు పాత తరం యంత్రాలతో ఇంటిల్లిపాది శ్రమ, ఆర్థిక భారం తప్పలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చేర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)

- కొనుగోళ్ల తుదిదశలో అందుబాటులోకి ఆధునిక తూర్పార యంత్రాలు
- ఇన్ని రోజులు పాతతరం యంత్రాలే దిక్కు
- వాటితో ఇంటిల్లిపాది శ్రమించాల్సిన పరిస్థితి
- ప్రైవేటు మిషిన్లతో రైతులపై ఆర్థిక భారం



చేర్యాల మార్కెట్‌కు వచ్చిన కొత్తయంత్రం

చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని వరి ధాన్యం, మక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా పంటల దిగుబడి, రైతుల రద్దీకి అనుగుణంగా తూర్పార పట్టే యంత్రాలను (ప్యాడీ క్లీనర్స్) సమకూర్చాల్సి ఉన్నా, చాన్నాళ్ల క్రితం మార్కెట్ యార్డుకు వచ్చిన పాతతరం యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో రోజులు తరబడి రైతులు వంతుల వారీగా ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పాతతరం యంత్రంతో తూర్పార పట్టడానికి కనీసం ముగ్గురు అవసరం కావడంతో, ఇంటిల్లిపాది శ్రమించాల్సి వస్తుంది. అదే కొత్తతరం క్లీనర్లతో ఒక్కరు ఉన్నా సరిపోతుంది. ఈ అవకాశాన్ని వాడుకుంటూ పలువురు ప్రైవేటు వ్యక్తులు మార్కెట్ యార్డులో ఆధునిక యంత్రాలను తీసుకువచ్చి గంటల ప్రామాణికంగా డబ్బులు వసూలు చేస్తూ తూర్పార పడుతున్నారు. గంటకు రూ.800 చొప్పున వసూలు చేయడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతున్నది.

అంతా అయిపోయాక..


ప్రస్తుతం వరి, మక్కజొన్న పంటకోతలు ఇప్పటికే పూర్తవగా, కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే మార్కెట్ యార్డుకు ఇటీవల పలు కొత్తతరం యంత్రాలను తీసుకువచ్చారు. కొనుగోలు కేంద్రం నిర్వహకులతో పాటు మార్కెట్ వర్గాలు ముందస్తుగా ఆయా యంత్రాలను సమకూర్చి ఉంటే, రైతులకు ఆర్థిక భారం తప్పడంతోపాటు త్వరితగతిన కొనుగోలు చేపట్టే అవకాశం ఉండేదని రైతులు వాపోతున్నారు. చాన్నాళ్లుగా మార్కెట్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు యంత్రాలను పర్యవేక్షించకపోవడం వలన ప్రైవేటు యంత్రాల వినియోగం పెరిగిన పరిస్థితులలో, ప్రస్తుతం తీసుకువచ్చిన కొత్త యంత్రాలనైనా సక్రమంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

బార్దానా కొరతతో నిలిచిన కొనుగోలు!

బార్దానా (సంచుల) కొరత కారణంగా కొద్దిరోజులుగా చేర్యాల మార్కెట్ యార్డులో మక్కజొన్నల కొనుగోలు నిలిచిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు యంత్రాల ద్వారా తూర్పార పట్టుకోవడం, నిర్ణీత తేమ శాతం ఉన్నా కూడా బార్దానా సంచులు లేవన్న కారణంగా కొనుగోలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. రోజుల తరబడిగా ఎదురుచూస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి, బార్దానా సంచుల కొరత తీర్చి మక్కజొన్నల కొనుగోలు వేగవంతం చేయాలని వేడుకుంటున్నారు.

ప్రాణాలు పోవాల్సిందేనా!

- గర్భిణికి అబార్షన్ మాత్రలిచ్చిన ఆర్ఎంపీ
- తిమ్మాపూర్ ఘటన మరువకముందే మరో దుశ్చర్య
- నిద్రావస్థలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ
- డబ్బు కక్కుర్తితో పట్టించుకోని వైనం



గజ్వేల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొందరు ఆర్ఎంపీల ఆగడాలు ఆగడంలేదు. తెలిసితెలియన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్, అనంతసాగర్‌లలో ఆర్ఎంపీల చికిత్స కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు మరువకముందే, తాజాగా మరో ఘోరం జరిగింది. గజ్వేల్‌లో ఒక ఆర్ఎంపీ వైద్యుడు ఏకంగా ఆరు నెలల గర్భిణికి గర్భస్రావ మాత్రలు ఇచ్చి అబార్షన్‌కు కారణమయ్యాడు. ఇప్పటికే ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా, నాలుగో సంతానం వద్దనుకున్న ఆ మహిళకు, పట్టణానికి చెందిన ఆర్ఎంపీ రవిందర్ మాత్రలు ఇవ్వగా గర్భస్రావం జరిగింది. ఈ ఘటనలో తల్లికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. కానీ, ఒకవేళ ప్రమాదం జరిగి ఉంటే ఆమె ముగ్గురు పిల్లలు అనాథలయ్యేవారు. డబ్బు కక్కుర్తి కోసం ప్రాణాల గురించి ఆలోచించకుండా ఆర్ఎంపీ చేసిన ఈ నిర్లక్ష్య చికిత్స తీవ్ర చర్చనీయాంశమైంది. అబార్షన్ అయిన పిండాన్ని గుట్టు చప్పుడు కాకుండా మాయం చేయ క్రమంలో పట్టుబడడంతో అసలు విషయం బయటపడింది. ఈ ఘటనలో ఆర్ఎంపీతో పాటు గర్భిణి, ఆమె భర్త కేసుల పాలయ్యారు.

ప్రాణాలు తీస్తున్నా... చర్యలు శూన్యం

రెండు నెలల క్రితం తప్పుడు వైద్యంతో నలుగురి ప్రాణాలు తీసిన ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రథమ చికిత్స కేంద్రాలను ఏకంగా ప్రైవేటు ఆసుపత్రులుగా నడుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్ఎంపీలు తమ కేంద్రాలలో మెడికల్ దుకాణాలు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా తనిఖీలు చేపట్టడం లేదు.

నోటీసులతో సరి..

ఏదైనా సంఘటన జరిగినప్పుడు నామమాత్రంగా నోటీసులు ఇవ్వడం లేదా తాత్కాలికంగా సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత ఎలాంటి పర్యవేక్షణా లేకపోవడంతో ఆర్ఎంపీల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపడితే, ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స అందించి, ఆ తర్వాత రోగులను పెద్ద ఆసుపత్రులకు పంపే అవకాశం ఉంటుంది. జిల్లా అధికారుల వ్యవహారశైలి దీనికి భిన్నంగా ఉండటంతో అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది.

మామూళ్ల మత్తేనా...?

నిత్యం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రథమ చికిత్స కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రథమ చికిత్స కేంద్రాలలో ఏమేం ఉండాలో కనీసం ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, మండల వైద్యాధికారులు ఆర్ఎంపీలు చేయవలసిన వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా, పలువురు ఆర్ఎంపీల నుంచి మామూళ్లు అందడం వల్లే అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల్లో చలనం వస్తుందో లేదో వేచి చూడాలి.

చాపకింద నీరులా హెచ్ఐవీ



సంగారెడ్డి జీజీహెచ్‌లో హెచ్ఐవీ బాధితుల చికిత్సా కేంద్రం(ఏఆర్‌టీ సెంటర్)

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- 'ఏఆర్‌టీ' ద్వారా 4423 మందికి చికిత్స
- అవగాహనతోనే వ్యాధి నియంత్రణ
- రేపు వరల్డ్ ఎయిడ్స్ డే

సంగారెడ్డి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్‌కు చాలా దగ్గర సంబంధం ఉంది. హెచ్ఐవీ అనేది ఒక వైరస్. ఈ వైరస్ తీవ్రత ప్రమాద స్థాయిలో ఉండటాన్ని ఎయిడ్స్‌గా పరిగణిస్తారు. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిలో రోగనిరోధకత పూర్తిగా నశిస్తుంది. హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించి రోగ నిరోధకతపై ఎలాంటి దుష్ప్రభావం లేని పరిస్థితిలో యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) చికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. ముందస్తు చికిత్స ద్వారా రక్తంలో హెచ్ఐవీ కణాల శాతాన్ని తగ్గించుకొని మెరుగైన జీవితాన్ని పొందవచ్చని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. డిసెంబరు 1 (రేపు) వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం.

ఈ ఏడాది 312 మందికి పాజిటివ్

సంగారెడ్డి జిల్లాలో హెచ్ఐవీ వైరస్ చాపకింద నిరులా విస్తరిస్తున్నది. జిల్లాలో 10,196 మంది బాధితులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 4,423 మంది ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మందులు, చికిత్స తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే 2023-24 ఏడాదిలో 58,142 మందికి హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయగా 696 మందికి పాజిటివ్ వచ్చింది. 2024-25 ఏడాదిలో 53,663 మందికి పరీక్షలు చేయగా 629 మందికి పాజిటివ్‌గా తేలింది. 2025 నవంబరు వరకు 34,850 మందికి పరీక్షలు చేయగా 312 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇందులో గర్భిణులు కూడా ఉండటం గమనార్హం. అయితే జిల్లావ్యాప్తంగా హెచ్ఐవీ బాధితులు 1,885 మంది 'చేయూత' పెన్షన్ పొందుతున్నారు.

అవగాహనతో నియంత్రణ

హెచ్ఐవీతో జీవిస్తున్న సగం మందిలో ఈ వైరస్ సంక్రమణ ద్వారా పొందామనే అవగాహన లేదు. చికిత్స చేయించుకోవడంపై ఆసక్తి చూపడం లేదు. ఈ తరుణంలో వీరందరికి మెరుగైన చికిత్స అందించి అదనంగా ఇతర అంటువ్యాధులు కూడా సోకకుండా జాగ్రత్త పడుతూ ఎయిడ్స్ వ్యాధిని ప్రపంచం నుంచి తరిమికొట్టాలని డబ్ల్యూహెచ్‌వో ఆశిస్తున్నది.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



హెచ్ఐవీ-ఎయిడ్స్ నివారణ లేని వ్యాధి. మనుషుల రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపే ఈ వ్యాధి వ్యాప్తి జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అసురక్షిత లైంగిక చర్యతో వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన వారు సకాలంలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే జీవిత ప్రయాణం పెరిగే అవకాశం ఉంటుంది. వ్యాధి నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- డా.వసంతరావు, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా

మేకలపై కుక్కల దాడి

- 10 మేకలు మృతి


మృతిచెందిన మేకలు

కొండాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 10 మేకలు మృతిచెందాయి. మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన సూర్యాపేట దయానంద మేకలను మేపుకుంటూ కుటుంబ సభ్యులతో జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం దయానందం పొలం వద్ద ఉన్న మేకల షెడ్డులోకి ఒక్కసారిగా కుక్కలు ప్రవేశించి దాడిచేశారు. ఈ దాడిలో 10 మేకలు అక్కడిక్కడే మృతిచెందాయి. తనకు జీవనాధారమైన మేకలు మృతిచెందడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు దయానందం వేడుకుంటున్నాడు.

ఆర్థిక సమస్యలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- గతంలో అన్న.. తమ్ముడు కూడా..


సుధీర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరైన గిరికీ లేక.. పూట గడవడం కష్టంగా మారడంతో ఆర్థిక సమస్యలు పెరిగాయి. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నలుగురు అన్నదమ్ములైన వీరి కుటుంబంలో మరో ఇద్దరు కూడా గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే ఆత్మహత్య చేసుకోగా, ఈ రోజు మరొకరు ఉరి వేసుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం మన్నెల్లి గ్రామానికి చెందిన నలుగురు సోదరులు హరీశ్, సుధీర్, లోకేష్, ఆదర్శ్‌లు చిన్నప్పుడు తూప్రాన్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇందులో చిన్నవాడైన ఆదర్శ్ ఇతర ప్రాంతానికి వెళ్లి అక్కడ పురోహిత్యం చేసుకుంటున్నాడు. రెండో వాడైన సాహంజీ సుధీర్(38) తూప్రాన్‌లో ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య పూజ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో కుటుంబంలో కలహాలు చెలరేగడంతో భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని నెలన్నర క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని సుధీర్ పలుమార్లు కోరినా, ఆమె రాలేదు. ఆర్థిక, కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన సుధీర్ శుక్రవారం రాత్రి చిన్నమ్మ ఇంట్లో భోజనం చేసి తను అద్దెకు ఉండే ఇంటికి పడుకోడానికి వెళ్లాడు. అర్ధరాత్రి తరువాత చిన్నమ్మ కల్పనకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. ఆమె వెంటనే వెళ్లి చూడగా, ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్-2 ఎస్ఐ యాదగిరి తెలిపారు. అయితే, సుదీర్ అన్న హరీశ్, తమ్ముడు లోకేష్‌లు కూడా గతంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ముగ్గురు అన్నదమ్ములు ఒకరివెనుక ఒకరు అన్నట్లుగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

రామాయంపేటలో వివాహిత ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణమని బంధువులు ఆరోపణ
- అనాథైన మూడేళ్ల బాలుడు


వందన(ఫైల్)

రామాయంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట బీసీ కాలనీలో చోటు చేసుకున్నది. కామారెడ్డికి చెందిన బచ్చు వందన(24), నరేష్ ఐదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. కట్నకానుకలు ఇచ్చి వందన తల్లిదండ్రులు పెళ్లి జరిపించారు. పెళ్లయిన రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన వందన శనివారం బెడ్‌రూం తలుపులు పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో భర్త నరేష్ బెడ్‌రూం తలుపులు పగులగొట్టి చూడగా వందన విగతజీవిగా కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారి సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారమందుకున్న ఎస్ఐ బాలరాజు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, మృతురాలి తరఫు వారికి చెప్పారు. మృతురాలికి మూడేళ్ల బాలుడు ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులకు రాత్రివరకు కూడా ఫిర్యాదు రాకపోవడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా భర్త అదనపు కట్నం వేధింపులకు వందన ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తరఫు బంధువులు ఆరోపించారు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంటలు అంటుకొని చికిత్స పొందుతున్న ఓ గృహిణి మృతిచెందింది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు చైతన్యనగర్‌లో నివాసముంటున్న లక్ష్మి(38) ఇంట్లో పెయింట్ వేసుకున్న తరువాత మిగిలిపోయిన టర్పెంట్ ఆయిల్‌ను వంట గదిలో సజ్జపై పెట్టింది. గురువారం ఉదయం వంట చేస్తున్న సమయంలో టర్పెంట్ ఆయిల్ సజ్జ పైనుంచి కిందికి కారుతూ ఆమెపై పడి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆమె బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కలవారు మంటలను ఆర్పి ఆస్పత్రిలో చేర్పించగా.. శనివారం మృతిచెందింది. కుమారుడు నీరుడి దినేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో మాజీ మావోయిస్టు మృతి


బాలనరసయ్య (ఫైల్)

కొండపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపాక గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు బాలనరసయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఆయన అకాల మరణం చాలా బాధాకరమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొండపాకలో ఆయన భౌతికకాయానికి పలువురు మాజీ మావోయిస్టులు, నాయకులు నివాళులర్పించారు. బాల నరసయ్య 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లో పాల్గొన్నారు. 20 ఏళ్ల అజ్ఞాత జీవితంలో మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకులు ఆర్కే సెక్యూరిటీ ఇన్‌చార్జిగా పనిచేశారు. పార్టీలో ఆయన దయ, రవన్న, విజయ్‌కుమార్, శ్రీకాంత్ పేర్లతో పనిచేశారు. కొన్నేళ్ల క్రితం లొంగిపోయాడు. శనివారం కొండపాకలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో విమలక్క, నర్సింలు, షకీల్, రామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి భానుచందు, రమేష్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రెండున్నర ఏళ్ల పాపతో తల్లి అదృశ్యం


అదృశ్యమైన తల్లి బిడ్డ(ఫైల్)

నర్సాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెండున్నర ఏళ్ల పాపతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని వసురాంతండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న దేవదత్తు రాము, భార్య కావేరి భార్యాభర్తలు. వీరికి రెండున్నరేళ్ల కూతురు భవాని ఉన్నది. ఆరోగ్యం బాగాలేదని నర్సాపూర్ ఆస్పత్రిలో చూయించుకుంటానని భార్య చెప్పడంతో రాము ఆటోలో వదిలేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కావేరికి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పటాన్‌చెరులో యువతి


తాబుసం

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వ్యవహారంపై కుటుంబసభ్యులు మందలించారని ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరులో నివాసముంటున్న తాబుసం బోరబండకు చెందిన ఓ అబ్బాయితో ఉన్న ప్రేమ వ్యవహారంపై బంధువులతో చర్చించారు. ఇందుకు వారు అంగీకరించకపోవడంతో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో భోజనం చేసిన తరువాత బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న ఎండీ.అర్బన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వృద్ధురాలి పుస్తెల తాడు అపహరణ

కొమురవెల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరణకు గురైన సంఘటన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ కోనేరు సమీరంలోని ఇంట్లో చోటు చేసుకున్నది. శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలు అనసూర్య మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని సీఐ ఎల్.శ్రీనివాస్ ఎస్ఐతో కలిసి పరిశీలించారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్రంలోని జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రారావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.గౌతమ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం మొత్తం 38 మందిని ఇన్‌చార్జీలుగా నియమించింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాకు సంగారెడ్డికి పెడాకుల శ్రీనివాస్, మెదక్ బోఖా నర్సింహారెడ్డి, సిద్దిపేట జె.సంగప్పలను నియమించింది.

కార్మికులపై కక్ష సాధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు



సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్మికులపై కక్ష సాధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో వారు మాట్లాడారు. పాశమైలారం ప్రాంతంలోని బిస్లరీ, మల్లెపల్లి పరిధిలోని మైక్రో బాక్స్ పరిశ్రమల్లో కార్మికులు చట్ట ప్రకారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకుంటే యాజన్యాలు కక్ష సాధింపులకు పాల్పడుతూ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశ్రామికవాడలో కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఆయా పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బాగారెడ్డి, ప్రవీణ్, ప్రసన్నరావు, విష్ణు, శ్రీనివాస్, శివ, మల్లేష్, భీమ్‌రెడ్డి, వేణు, ప్రశాంత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

పెద్దశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని మంథని పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నర్సరీ నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఎంఈవో వెంకటేశం సందర్శించి విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగనాథ్‌రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలి

● ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ



పెద్దశంకరంపేటలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ

పెద్దశంకరంపేట/టేక్మాల్/గజ్వేల్/కంది/వర్గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీడీవో షాకీర్‌అలీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో క్రాంతికుమార్, ఆర్‌ఐ.రమేష్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల నామినేషన్ వేసే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ జుల్ఫీఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజొద్దీన్‌ను నామినేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే టేక్మాల్ నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియకు చేపడుతున్న బందోబస్తును మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయికిషోర్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ క్లస్టర్‌లో పంచాయతీరాజ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అబ్జర్వర్ కే.హరిత పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని కాశీపూర్, కంది రైతువేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్‌రెడ్డి జడ్పీసీఈవో జానకీరెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సుధీర్‌రెడ్డి, సరిత తదితరులు ఉన్నారు. వర్గల్ మండలంలోని గౌరారం క్లస్టర్‌లో సింగాయిపల్లి, గౌరారం, చౌదరిపల్లి, చాంద్‌ఖాను మక్తా, అవుసులోనిపల్లి గ్రామపంచాయతీల నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు హరిత పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సౌకర్యాలు ఉన్నాయా, హెల్ప్, ఆర్‌వో పనితీరును పరిశీలించారు. గ్రామపంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు చేయాలనుకుంటే 6305956344 నంబరు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

జిల్లాలో స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీక్‌రెడ్డి, రాకేష్

● కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థానిక సంస్థల (గ్రామపంచాయతీ) ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీక్‌రెడ్డి, రాకేష్ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 29తో ముగిసిందని, నేటి నుంచి రెండోవిడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని నోడల్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జానకీరెడ్డి, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు కొత్త కార్యవర్గాలు కొలువు దీరుతున్నాయి. ఏళ్లుగా ఎన్నికలు లేని పంచాయతీలను తీర్చిదిద్దే బాధ్యత వారిపై ఉన్నది. అయితే ఉమ్మడి జిల్లాలో పలు గ్రామపంచాయతీ భవనాల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొత్తగా జీపీలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం భవనాలకు నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి చేయడంపై శ్రద్ధ చూపలేదు.



వెల్దుర్తి : పూర్తయిన రామాయిపల్లి గ్రామపంచాయతీ భవనం



నర్సాపూర్ : జక్కపల్లిలో అసంపూర్తి దశలోనే నిలిచిపోయిన పంచాయతీ భవనం

అద్దె భవనాలు.. అరకొర వసతులు..

● సమస్యల వలయంలో 'పంచాయతీ'లు

● ఇప్పటికీ సొంత భవనాలు కరువు



నూతనంగా ఏర్పడిన శేరి గ్రామపంచాయతీ



వెల్దుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండలంలోని 21 గ్రామపంచాయతీలు ఉండగా.. పాత గ్రామపంచాయతీల్లో అన్ని గ్రామాలకు పంచాయతీ భవనాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆరు గ్రామపంచాయతీల్లో ఇప్పటికీ భవనాలు లేవు. రామాయిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. చర్లపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో స్లాబ్ లెవల్, బస్వాపూర్ గ్రామంలో పనులు ప్రారంభమయ్యాయి. మహ్మద్‌నగర్‌తండాలో పనులు ఇంకా ప్రారంభంకాలేదు. కాగా శంశిరెడ్డిపల్లితండాలో గ్రామపంచాయతీ భవనం మంజూరై రద్దయింది. వీటితో పాటు నూతనంగా ఏర్పాటైన శేరీల, ఎల్కపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేవు. ఆరెగూడెంలో ప్రైవేటు భవనంలో.. మరో ఐదు గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.



నారాయణఖేడ్ : పాఠశాల భవనంలో కొనసాగుతున్న మాద్వార్ తండా గ్రామపంచాయతీ కార్యాలయం

17 పంచాయతీలకు సొంత భవనాలు కరువు

నర్సాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో 35 పంచాయతీలు ఉండగా.. ఇందులో 17 గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో సొంత భవనాలు నిర్మించేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న మదన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా.. పంచాయతీ భవనాల నిర్మాణాలు అసంపూర్తి దశలోనే ఉన్నాయి. మంజూరు చేసిన నిధులు సరిపోవనే ఉద్దేశంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదన్న ప్రచారమూ ఉన్నది. మండలంలోని జక్కపల్లిలో అప్పటి సర్పంచ్ వెంకటలక్ష్మి భర్త శ్రీనివాస్ పంచాయతీ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టినా బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. తుల్జారాంపేటలో అప్పటి సర్పంచ్ సామ్యానాయక్ అప్పులు చేసి పంచాయతీ భవనాన్ని పూర్తిచేసినా బిల్లులు రాకపోవడంతో చివరగా కొన్ని మిగిలి ఉన్న పనులను అలాగే వదిలేశారు. ఈ భవనం దాదాపు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు.


ప్రైవేట్, పాఠశాల భవనాల్లో 'పంచాయతీ'లు

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలంలో 47 గ్రామపంచాయతీలుగా ఉండగా, 12 గ్రామపంచాయతీలకు ఇప్పటివరకు పంచాయతీ కార్యాలయ భవనాలు నిర్మించలేదు. దీంతో మాద్వార్‌తండా, అకలాయితండా, ఖాంజీపూర్, జి.హుక్రాన, జూజాల్‌పూర్, పోతన్‌పల్లి, ఆర్ తుర్కపల్లి తండా, గోప్యానాయక్‌తండా, గ్రామపంచాయతీలకు భవనాలు లేవు. కొన్ని గ్రామపంచాయతీలకు నిధులు మంజూరైనా.. కొన్నిచోట్ల పనులు ప్రారంభించలేదు. మాద్వార్‌తండా, అకలాయితండాల్లో పాఠశాల భవనాల్లో, జూజాల్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామపంచాయతీలు కొనసాగుతున్నాయి. జి.హుక్రాన, ఖాంజీపూర్, డీఎన్‌టీతండా, జూజాల్‌పూర్ తదితర చోట్ల ఇంకా పనులు ప్రారంభం కాలేదు. దీనికితోడు లింగనాయక్‌పల్లి, గుండు, హనుమాన్‌తండాలు నూతన పంచాయతీలుగా ఏర్పడడంతో ఇక్కడా కార్యాలయాలు లేవు. మొత్తం మీద నారాయణఖేడ్ మండలంలో 12 గ్రామపంచాయతీలకు, గ్రామ పంచాయతీ భవనాలు లేవు.

ఏకగ్రీవం వైపు 'పంచాయతీల' మొగ్గు..

● 16 పంచాయతీలు ఏకగ్రీవం

● సంబరాలు జరుపుతున్న ప్రజలు



కంది : ఏకగ్రీవమైన తునికలతండా పంచాయతీ నూతన పాలకవర్గంతో గ్రామస్థులు, నాయకులు

కంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల వేల ఉమ్మడి జిల్లాల్లో ఏకగ్రీవాల జోరు నడుస్తోంది. పలు గ్రామాల అభివృద్ధి కోసం గ్రామస్థులందరూ చర్చించుకుని పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని తునికిల తండా గ్రామపంచాయతీ సర్పంచ్, 8 మంది వార్డుసభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాట్రోత్ మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలిసి ఈసారి నామినేషన్ అధికార పార్టీ అభ్యర్థులనే ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచ్‌గా నేనావత్ కిషన్‌నాయక్, ఉపసర్పంచ్‌గా 8వ వార్డుసభ్యుడు నేనావత్ అంబర్‌సింగ్‌ను, 8 మంది వార్డుసభ్యులు ఏకగ్రీవయ్యారు.

'పేట'లో నలుగురు సర్పంచులు ఏకగ్రీవం

పెద్దశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతీలు ఉండగా, నాలుగు గ్రామపంచాయతీలకు శనివారం సాయంత్రం వరకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో సర్పంచ్ ఏకగ్రీవం ఖరారవుతున్నట్లు తెలుస్తుంది. పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపాయలతండాకు చెందిన దేవసోత్ కవిత, సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన పి.బాలమణి, మాడ్చేట్‌పల్లి గ్రామానికి చెందిన గాజుకుమార్, గట్టుకిందితండాకు చెందిన మునావత్ రాజు ఏకగ్రీవ సర్పంచులుగా ఎన్నిక కానున్నారు.

జగదేవ్‌పూర్‌లో మూడు గ్రామాలు..

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలుగుగడ్డ, కొండాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా ఖరారయ్యాయి. పలుగుగడ్డ సర్పంచ్‌గా నర్ర కనకయ్య, కొండాపూర్ సర్పంచ్‌గా సుప్పరి పుష్ప, అనంతసాగర్ సర్పంచ్‌గా క్యాసారం కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు, యువత, పెద్దలు సంబరాలు జరుపుకున్నారు. అలాగే గజ్వేల్ మండలం రంగంపేట సర్పంచ్‌గా వరిగొప్పుల నాగరాజు ఏకగ్రీవయ్యారు. వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్తా సర్పంచ్‌గా మేధిని సజనిత, వర్గల్ మండలం గుంటిపల్లి సర్పంచ్‌గా బొమ్మ మహంకాళి, రాయపోల్ మండలం పెద్ద ఆరెపల్లి సర్పంచ్‌గా దివ్యకృష్ణ ఏకగ్రీవమయ్యారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు.

లింగాయిపల్లితండా ఏకగ్రీవం..

దౌల్తాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండలంలోని మొట్టమొదటిగా లింగాయిపల్లితండా సర్పంచ్‌గా గుగులోతు లక్యానాయక్ ఏకగ్రీవమయ్యారు. 486 మంది ఓటర్లు తండా అభివృద్ధికి లక్యానాయక్‌ను ఏకగ్రీవం చేశారు. తండా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని లక్యానాయక్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. సర్పంచ్ బరిలో..

● తాత ఆశయం మేరకు పోటీ



కంజర్ల చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పదేళ్లుగా అక్కడే కుటుంబంతో ఉంటున్నారు. ఆయన తాత ఆ గ్రామానికి 40 ఏళ్లుగా సర్పంచ్.. తాను చేసినట్లే తన మనవడూ గ్రామానికి సేవ చేయాలని భావించాడు. ఆయన ఆశయాన్ని నెరవేర్చడం కోసం ఆ మనవడు అమెరికాలో ఉద్యోగం వదిలి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట గ్రామానికి చెందిన కంజర్ల చంద్రశేఖర్ అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. పదేళ్లుగా అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. అతని తాత కంజర్ల శంకరప్ప చినశంకరంపేట సర్పంచ్‌గా 40 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఆయన హయాంలో గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. ఆయన తర్వాత మరికొందరు సర్పంచ్‌లుగా ఎన్నికైనా శంకరప్ప ముద్ర గ్రామంపై అలాగే ఉంది. అయితే, తన తాతలాగే తానూ గ్రామానికి సేవ చేయాలని ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ ఆరు నెలల క్రితం గ్రామానికి వచ్చి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఆయన పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్‌గా పోటీ చేసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి వచ్చినట్లు ఈ సందర్భంగా కంజర్ల చంద్రశేఖర్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.





సండే స్పెషల్ Sunday Special

ఖేడ్ మండలంలోని అనంత్‌సాగర్‌లో వెలసిన మల్లన్న దేవుడు, మల్లన్న జాతర సందర్భంగా షిడీ ప్రదర్శన చేస్తున్న భక్తుడు(ఫైల్)

150 ఏళ్ల సంప్రదాయం.. బండిషిడీ ఉత్సవం

● అనంత్‌సాగర్ మల్లన్న జాతరలో విశేష ఘట్టం

● పొడవాటి కర్రకు మనిషిని వేలాడదీసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ

● దత్తాత్రేయ జయంతి సందర్భంగా నేడు నిర్వహణ

నారాయణఖేడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనంత్‌సాగర్‌లో దాదాపు 200 ఏళ్లక్రితం రాయిదొర పాలనలో కలరా వ్యాధి సోకింది. ఆ సమయంలో సాధుసంతులు... వ్యాధి బారి నుంచి ప్రజలను కాపాడడం కోసం కర్ణాటకలోని మైలారంలో ఉన్న మల్లన్నదేవుడి విగ్రహాన్ని తెచ్చి గ్రామంలో ప్రతిష్ఠించాలని సూచించినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. దీంతో గ్రామస్థులంతా ఏకమై మైలారం వెళ్లి దేవుడిని తీసుకొచ్చి గ్రామంలో ప్రతిష్ఠించారు. అప్పటినుంచి కర్ణాటకలో నిర్వహిస్తున్న మాదిరిగానే ఇక్కడ కూడా ప్రతీ సంవత్సరం మార్గశిరం ప్రారంభంలో, దత్తాత్రేయ జయంతి సందర్భంగా మల్లన్న జాతరను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు సుమారు 150 సంవత్సరాలకుపైగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. జాతరలో విశేష ఘట్టమైన తన్మయత్వంతో నిర్వహించే బండిషిడీ ఉత్సవం ప్రధానంగా ఆకట్టుకుంటుంది.

కర్రను పట్టుకుని..

మల్లన్న దేవుడికి మొక్కులు తీర్చుకోవడానికి గ్రామస్థులు ప్రత్యేకంగా తయారుచేసిన బండికి పొడవాటి కర్రను అమర్చుతారు. ప్రదర్శన చేసే భక్తుడిని ఒక కాలును ఆ కర్రకు చివరన కట్టి, ఆయనను ఆకాశంలోకి వేలాడదీస్తారు. ఆ భక్తుడు ఒక చేతితో కర్రను పట్టుకుని, మరో చేతితో భక్తులపై కుంకుమ, పసుపు, వేపాకును చల్లుతుంటాడు. అత్యంత ప్రమాదకరంగా కనిపించే ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివస్తారు. ఆ భక్తుడిని గుడి చుట్టూ ఐదు మార్లు తిప్పుతారు. పూర్వం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని గ్రామానికి చెందిన ఒకే కుటుంబ వారసులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. బండిషిడీ ప్రదర్శనతో పాటు జాతర సందర్భంగా శివసత్తుల ప్రదర్శనలు, వీధి నాటకాలు, బోనాలు, బండ్ల ఊరేగింపు వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం బండిషిడీ ప్రదర్శన కొనసాగనున్నది.

దేవుడిపై నమ్మకంతో



దేవుడిపై నమ్మకంతో మా కుటుంబ సభ్యులు 150 ఏళ్ల నుంచి షిడీ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. జాతర రోజే ఒగ్గు కుటుంబంలో నుంచి ఒకరిని షిడీ ప్రదర్శనలో పాల్గొనడానికి ఎంపిక చేస్తాం. ఎవరూ ప్రదర్శనలో పాల్గొంటారో వారి గృహం నుంచి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లి షిడీకి కట్టి ఊరేగిస్తారు.

- ఒగ్గు శంకర్, షిడీ ప్రదర్శన కుటుంబసభ్యుడు

వైభవంగా కల్యాణానికి ఏర్పాట్లు



మా గ్రామంలో మల్లన్న జాతరను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11 గంటలకు మల్లన్న కల్యాణం నిర్వహించనున్నాం. కల్యాణోత్సవానికి మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించాం. కల్యాణోత్సవంలో భక్తులు భారీగా పాల్గొంటారు.

- సిద్ధు, అనంత్‌సాగర్ గ్రామస్థుడు

అందెశ్రీ ప్రజాగొంతుక



సభలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి అందెశ్రీ ప్రజాగొంతుక అని ప్రముఖ కవులు తైదల అంజయ్య, డాక్టర్ పొన్నల బాలయ్య పేర్కొన్నారు. శనివారం టీపీటీఎఫ్ సిద్దిపేట జోన్ ఆధ్వర్యంలో అందెశ్రీ, కే.నారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. టీపీటీఎఫ్ కన్వీనర్ ఏ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు వారు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకాలంలో ప్రజాగొంతుకై, ప్రజల పక్షాన నిలబడి, కొట్లాడి తెలంగాణ సాధనకు కృషిచేశారన్నారు. తెలంగాణ ఉద్యమమే కాకుండా సామాజిక ఉద్యమాల్లో, తెలంగాణ రాష్ట్ర గీతం రాయడంలో అందెశ్రీ ఎంతో చొరవ చూపారని గుర్తుచేశారు. మానవ విలువల కోసం ప్రజల కోసం ఎలుగెత్తి చాటి, గొంతెత్తి పాడారని, వారికి ఘన నివాళులర్పిస్తున్నామన్నారు. అలాగే కే.నారాయణ మృతి ఉపాధ్యాయ లోకానికి తీవ్ర లోటని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీ.తిరుపతిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు తిరుపతి, జానకీరాములు, రాంరెడ్డి, కృష్ణ, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న భీమ్‌సేన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇంటర్ డీపీఎస్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం పాఠశాల వైస్ చైర్మన్ టి.భీమ్‌సేన్, ప్రిన్సిపాల్ సి.జె వసంత పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 17 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వరుసగా మూడో ఏడాది కొల్లూరు డీపీఎస్ ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. అండర్-10, 13, 15, 17 వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్‌చెరు వేదిక : ఎమ్మెల్యే

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో క్రీడా పోటీలు నిర్వహించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మైత్రి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీలను ప్రారంభించారు. విద్యార్థులు జిల్లాలవారీగా పరేడ్ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆటలపట్ల ఆసక్తి చూపించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, విజయకుమార్, హరికిషన్, శ్రీకాంత్, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీకట్లో చేర్యాల

- ప్రారంభానికి నోచుకోని సెంట్రల్ లైటింగ్
- ప్రమాదాలకు నిలయంగా మారిన జాతీయ రహదారి

చేర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి అంధకారమయమవుతుంది. సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొన్నాళ్లక్రితం పట్టణంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించి సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేశారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో పట్టణం చీకట్లో మగ్గుతోంది. చేర్యాలను 2018 ఆగస్టులో మున్సిపాలిటీగా మార్చిన క్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవ వహించి ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా పాత డివైడర్ల స్థానంలో కొత్తనిర్మాణం చేపట్టి విద్యుత్‌లేన్ ఏర్పాటుచేశారు గాంధీచౌరస్తా, పాత బస్టాండు, అంగడిబజారు చౌరస్తా మినహా పట్టణశివారులోని ఇండేన్ పెట్రోల్‌పంప్ నుంచి వివేకానంద ఫంక్షన్‌హాల్ సమీపం వరకు సెంట్రల్ లైట్లు కూడా బిగించారు. కానీ, వాటిని ప్రారంభించకుండా వదిలేయడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ఇతర ప్రదేశాలలోని పాత లైట్ల విద్యుత్ లేన్ దెబ్బతినగా కొత్తవాటిని ఏర్పాటు చేయకపోవడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. డివైడర్ల మధ్య ఏపుగా పెరిగిన చెట్లకు తోడు గ్రిల్స్ ఏర్పాటుచేయడానికి తోడు రాత్రివేళ లైట్లు వెలగక నెలకొన్న అంధకారం కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల మున్సిపల్, ఎన్‌హెచ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాలని ఆదేశించారు. రోజులు గడిచినప్పటికీ పెడచెవిన పెట్టడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.



అలంకారప్రాయంగా పట్టణ శివారు నుంచి ఉన్న సెంట్రల్ లైటింగ్



సెంట్రల్‌లైట్లు వెలగకపోవడంతో చీకటిమయంగా జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి రూ.87వేల జరిమానా

గజ్వేల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 16మందికి జరిమానా విధించారు. గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో నిర్వహించిన తనిఖీల్లో 16మంది వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా, శనివారం వారిని కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 16మందికి రూ.87 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించినట్లు సీఐ మురళీ తెలిపారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ డిమాండ్



కేజీబీవీ ఉపాధ్యాయులతో టిపిటిఎఫ్ నాయకులు

కోహెడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ) పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ ప్రభాకర్, సీనియర్ నాయకుడు మహ్మద్, మండల అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్ కనకయ్యలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయుల సమ్మె కాలానికి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కేజీబీవీలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని, నూతన పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. మహిళా ఉపాధ్యాయులకు అన్ని రకాల సెలవులను వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

తొలి సర్పంచ్‌లుగా ఎవరిని ఆశీర్వదిస్తారో..

- మూడు నూతన గ్రామ పంచాయతీలకు తొలిసారి ఎన్నికలు
- ఎల్లమ్మజాలులో ఒకే సామాజిక వర్గం వారు ఉండటం విశేషం

చిన్నకోడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో విజయం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తిగా మారింది. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిన్నకోడూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా కమ్మర్లపల్లి, ఎల్లమ్మజాలు, శంకరాయకుంట మూడు గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. దీంతో ప్రస్తుతం 28 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. తొలిసారిగా ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలైన కమ్మర్లపల్లి బీసీ (మహిళ), ఎల్లమ్మజాలు బీసీ (మహిళ), శంకరాయకుంట బీసీ (జనరల్) సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. ఈ మూడు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు తొలిసారిగా జరుగుతుండటంతో పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉండే అవకాశం ఉంది.

ఈ గ్రామ పంచాయతీలకు మొదటి సర్పంచ్‌లుగా ప్రజలు ఎవరిని ఆశీర్వదిస్తారో అనేది ఆసక్తిగా మారింది. డిసెంబరు 14న రెండో విడత ఇక్కడ ఎన్నికలు జరగబోతుండటంతో నేటి నుంచి నామినేషన్‌లు ప్రారంభంకానున్నాయి. ఎల్లమ్మజాలు గామ పంచాయతీలో ఒకే సామాజిక వర్గం (ముదిరాజ్) వారు ఉండటం విశేషం.



చిన్నకోడూరు మండలంలోని ఎల్లమ్మజాలు గ్రామం

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి

మిరుదొడ్డి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ వేసే ప్రక్రియను అధికారులకు వివరించారు. ఎన్నికల్లో ఆర్‌వో, ఏఆర్‌వోలు నిర్వర్తించాల్సిన విధులను తెలియజేశారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్‌బాబు, ఎంపీవో ఫహీమ్, అధికారులు తదితరులున్నారు.

పార్టీలకతీతంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

గజ్వేల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థలను పురస్కరించుకొని జరగబోయే స్థానిక సంస్థల ఎలక్షన్‌లలో గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలు, సమస్యల సాధన పరిష్కార దిశగా ఊరికి ఉరేసేవాడిని కాకుండా, ఊరికి ఊపిరి పోసేవాడిని ఎన్నుకోవాలన్నారు.

పద్మశాలి యువజన అధ్యక్షుడిగా తలకొక్కుల ప్రేమ్‌కుమార్

గజ్వేల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం యువజన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తలకొక్కుల ప్రేమ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గజ్వేల్ పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శేర్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా హనుమండ్ల నాగరాజు నేత, కోశాధికారిగా గుండు మల్లేశం, సహాయ కార్యదర్శిగా రాచకొండ సాయికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీల ఐకమత్యానికి, బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాల తొలగింపు

హుస్నాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన వ్యాపారాలను మున్సిపల్, పోలీసు అధికారులు తొలగించారు. రోడ్డును ఆనుకొని ఏర్పాటు చేసిన బోర్డులు, ఇతర వ్యాపార వస్తువులను మున్సిపల్ వాహనంలో తీసుకెళ్లారు. ప్రధాన రహదారికి ఆనుకొని వ్యాపారాలు చేయవద్దని, ఫుట్ పాత్‌లపై ఎలాంటి వ్యాపార వస్తువులు పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఎస్సై లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

కొమురవెల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో రోడ్డుపై వరకు దుకాణాల వస్తువులను నిలిపి ఉంచడం వల్ల భక్తులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో శనివారం చేర్యాల సీఐ ఎల్.శ్రీనివాస్ స్థానిక ఎస్సై మహేష్‌తో కలిసి రోడ్డుపై వరకు ఏర్పాటు చేసిన దుకాణాల వస్తువులను తొలగింపచేశారు.రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేసి మార్కింగ్ దాటకుండా వ్యాపారాలు చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు.

ఎవరైనా మార్కింగ్ దాటి దుకాణ వస్తువులు, టేబుల్స్ రోడ్డుపై ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఫుట్ పాత్‌లపై ఉన్న వ్యాపార వస్తువులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వరి కొయ్యలు తగులపెట్టొద్దు

కోహెడ/రాయపోల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోహెడ, రాయపోల్ మండలాల్లో వరి కొయ్యకాల్లు తగలబెడుతుండగా వ్యవసాయ అధికారులు అడ్డుకున్నారు. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో రైతు నర్సింహులు వరి కొయ్యకాల్లు తగలబెడుతుండగా, గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబూనాయక్, మండల వ్యవసాయ అధికారి నరేష్ అక్కడికి చేరుకుని తగలబెట్టడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వెంటనే కొయ్యకాల్లు తగలబెట్టడాన్ని నిలిపివేయించారు.

ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. కొయ్యకాల్లు కాల్చడం వలన భూమికి లాభం చేసే సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని, పర్యావరణ కాలుష్యం పెరిగి పంట దిగుబడి దెబ్బతింటుందని పేర్కొన్నారు. వరి అవశేషాలను భూమిలో కలిపి దున్నితే సేంద్రీయ కర్బనము పెరిగి దిగుబడి మెరుగై, సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయడం ద్వారా అవశేషాలు త్వరగా కరుగుతాయని, డీఏపీ వినియోగాన్ని సగం వరకు తగ్గించవచ్చని తెలిపారు. అంతేకాక భూమి గుల్లగా మారి నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాక నత్రజని, భాస్వర, సూక్ష్మ పోషకాలు లభించి పంటలకు మేలు జరుగుతుందని అధికారులు వివరించారు.



రాయపోల్ మండలం కొత్తపల్లి వరికోయల మంటలను ఆర్పివేయిస్తున్న ఏడీఏ బాబూనాయక్

కోహెడలో

రైతులు వరి కోతలు కోసిన తర్వాత వాటి కొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. శనివారం మండలంలోని శనిగరం గ్రామంలో వరి కొయ్యలను పొలములోనే కాల్చడం వల్ల జరిగే నష్టాలను రైతులకు ఆయన వివరించారు.

పౌరహక్కులపై అవగాహన

బెజ్జంకి/మద్దూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి, మద్దూరు మండలాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ధూళిమిట్ట మండలం భైరాన్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ఎస్సై షేక్ మహబూబ్ అలీ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. శనివారం రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దళిత కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికి సమానమేనన్నారు. ఎవరైనా హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు.

బెజ్జంకిలో..

పౌరహక్కుల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రెవెన్యూ, పోలీసు అధికారులు అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కుల, మతాలకు అతీతంగా కలిసిఉంటేనే అందరూ పౌరహక్కులను సమానంగా అనుభవిస్తారని తెలిపారు. ఆర్‌ఐ సంతోష్, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, పంచాయతీకార్యదర్శి గ్రామస్థులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమై, ప్రజా పాలన పేరుతో ప్రజలను మభ్య పెడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ఆరోపించారు. శనివారం జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు మాజీ సభ్యుడు సడాల కరుణాకర్ బీజేపీలో చేరారు. ఆయనను పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. జగదేవ్‌పూర్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ.. జగదేవ్‌పూర్ గ్రామంలో బీజేపీ బలమైన పార్టీగా ఏర్పడుతోందన్నారు. బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సడాల కరుణాకర్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు కుకునూరుపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, పాఠశాల బృందం

కుకునూరుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి విద్యార్థినులు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలలో భాగంగా అండర్-14 బాలికల విభాగంలో కుకునూరుపల్లి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సోమయనాజ్, మహిరనాజ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. మహిర విద్యార్థిని ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకి కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ నెల పెద్దపల్లి జిల్లాలో 26 నుంచి 28 వరకు జరిగిన పోటీలలో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో సత్తయ్య పాఠశాల బృందం అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు..

బెజ్జంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :స్థానిక సంస్థల ఎన్నికలలో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. పంచాయతీలో ఎన్నికల్లో భాగంగా శనివారం బెజ్జంకి మండల కేంద్రంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిర్భయంగా ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు, భయాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటివిఘాతం కలుగకుండా పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల జరిగేలా చూడాలి

నంగునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీవో మహబూబ్ అలీ అన్నారు. శనివారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆర్వోలు ఏవోఆర్ లకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. అభ్యర్థులకు ఇబ్బందులు కదలకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్లస్టర్ వారిగా అధికారులకు ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలలో ఎన్నికలు జరగనున్నాయని ఈ సారి క్లస్టర్ల వారిగా నామినేషన్ల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం ఎనిమిది ప్రధాన క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల కేంద్రాలు ఉండేవని ఈ సారి క్లస్టర్ల వారిగా నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.



నంగునూరులో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహబూబ్ అలీ



ఆదివారం బ్యాంకుల సెలవు దినం కావడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంకు ఖాతాలను తీసేందుకు మండల కేంద్రంలోని బ్యాంకులకు పరుగులు తీశారు

-బెజ్జంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిధిలో ఆయా ప్రదర్శనలను నిర్వహించడం వలన విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చు అని వికాస్ హై స్కూల్ సీబీఎస్సీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా, వికాస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుమోహన్ అన్నారు. శనివారం సీబీఎస్సీ పరిధిలోని పాఠశాలలో డిజిటల్ ఎక్స్పో కార్యక్రమాన్ని నిర్వహించారు. .

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

గజ్వేల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఎస్టీ హాస్టల్ విద్యార్థులు చలికి వణుకుతున్నారని డీబీఎఫ్ చేసిన విన్నపానికి స్పందించిన ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భిక్షపతి నర్సింలు, స్వాతి దంపతుల కుమారుడు విహాన్ అధిరామ్ 2వ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఎస్టీ హాస్టల్‌లో 42 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆటపాటలతో కూడిన విద్యాబోధన

గజ్వేల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తామని దాని ద్వారా పిల్లలు మానసిక వృద్ధి చెందుతారని ఐసీడీఎస్ సూపర్వైజర్ భవాని, లయన్స్‌క్లబ్ ప్రతినిధి కుమారస్వామి అన్నారు. శనివారం మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో ప్రభుత్వ ఫంక్షన్‌హాల్‌లో ఐసీడీఎస్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, బాలమేళ నిర్వహించారు.

నేటి నుంచి రెండోవిడత

(5వ పేజీ తరువాయి)

ఏడు మండల్లాలోని 163 గ్రామ పంచాయతీల్లో, 1,432 వార్డులకు గానూ తొలివిడత నామినేషన్లను స్వీకరించారు. ఇక ఆదివారం ఉదయం నుంచి సిద్దిపేట రెవెన్యూ డివిజన్‌లో రెండో విడత నామినేషన్ల ప్రక్రి ప్రారంభం కానుంది.

మూడురోజుల పాటు..

ఈ నెల 30 నుంచి డిసెంబరు 2 వరకు అభ్యర్థుల నుంచి రెండోవిడత నామినేషన్లను అధికారులు స్వీకరించనున్నారు. ఈ మేరకు సిద్దిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలు అక్బర్‌పేట-భూంపల్లి, బెజ్జంకి, చిన్నకోడూర్, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, తొగుట మండలాల్లోని 182 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 1,644 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లను వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఉదయం 10.30 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను అధికారులు స్వీకరించనుండటంతో అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు తొలివిడత నామినేషన్ల పరిశీలన..

తొలివిడతలో నామినేషన్లను అధికారులు ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పరిశీలించనున్నారు. ఆ తరువాత చెల్లుబాటైన నామినేషన్ల అభ్యర్థుల జాబితాను ప్రకటించి నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచనున్నారు. అప్పీళ్ల కోసం డిసెంబరు 1 సాయంత్రం 5 గంటల వరకు గడువును విధించారు. వచ్చిన అప్పీళ్లను డిసెంబరు 2 సాయంత్రంలోగా పరిష్కరించనున్నారు. డిసెంబరు 3న మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు 3 గంటల తర్వాత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు బరిలో నిలిచిన అభ్యర్థుల తుదిజాబితాను విడుదల చేస్తారు.

మోసానికి మరో రూపం కాంగ్రెస్

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోసానికి మరో రూపం కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందంటూ పార్టీ పిలుపుమేరకు పాత బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని చూడగా పోలీసులు అడ్డుకొని వన్‌టౌన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. బీజేపీ నాయకులు కాసాని కొట్టు సంతోష్, గుండ్ల జనార్థన్, తొడుపునూరి వెంకటేశం, దాబా నరేష్, లక్ష్మారెడ్డి, సురేష్, భోగి శ్రీనివాస్, సంతోష్, గంధం కర్నాకర్ అరిగే యాదగిరి తాడేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.